# చనిపోకూడని మనిషి

**పౌరహక్కుల** ఉద్యమకారుడు కె. బాలగోపాల్ మరణానికి సంతాప సూచకంగా ఈదేశపు జాతీయ పతాకను ఎవరూ అవనతం చేసే అవకాశం లేదు. ఆయన ఈ దేశం నిజమైన అర్ధంలో ఎవరిదో ఆ అశేష జన బాహుళ్యం కోసం శ్రమించాడు. కాని తమకై నిలిచిన వారికోసం జండానుసగం మేర ఎగరవేసే అధికారం వారికిలేదు. లేనిపక్షంలో పౌరహక్కులనే మాట ఒకటి ఉందని,అది రాజ్యాంగం తమకిచ్చినా అదే రాజ్యాంగం పేరిట ఈ దేశాన్ని పాలిస్తున్నవారు తమకివ్వదలచుకోలేదని, అందుకోసం ఉద్యమించి సాధించుకోవాలని బాలగోపాల్ ద్వారా తెలుసుకున్న అశేష జనావళి, ఈ శుక్రవారం నాడు తమ దేశ పతాకను తప్పక అవనతం చేసి ఉండేవారే.

వర్ధమాన సమాజాలలో ఎప్పుడూ చనిపోకూడని మనుషులలో బాలగోపాల్ ఒకరు. ఆ మాటకు వస్తే అభివృద్ధి చెందిన సమాజాలలోనూ ఆర్థికాభివృద్ధి చెందలేదు. పేదలు, అల్పసంఖ్యాక వర్గాలవారు, వలసలు వచ్చి స్థిరపడినవారు, పాలకుల రంగుకు, జాతికి చెందని వారు హక్కులరీత్యా అక్కడ ద్వితీయశ్రేణి పౌరులే. పాలకులకు ఇబ్బందిగా తోచినపుడల్లా సాగించగల అణచివేతలు తమకోసం పొంచి ఉన్నవారే. ఆవిధంగా బాలగోపాల్ వంటివారిఅవసరంలేని సమాజాలు ప్రపంచంలోనే లేవు. ప్రజలు, ప్రజాస్వామ్యం, దేశం, సమాజం, ప్రజల హక్కులు అనే మాటలకు ఎనలేని అర్థం, గొప్పతనం ఉన్నాయి. హక్కుల పరిధిని కనుగొనేందుకు రాజ్యాంగాన్ని, చట్టాలను చూడాలి. వాటి విలువను, లోతును గ్రహించాలంటే మాత్రం బాలగోపాల్ వంటివ్యక్తుల

పనితో పరిచయం ఉండాలి. ఒక దేశపాలకులు తమదిప్రజాస్వామ్యమని చెప్పుకుని ఎటువంటి రాజ్యాంగాలు, చట్టాలైనా తయారు చేయవచ్చుగాక. కాని, ప్రజలు పౌరహక్కులకోసం ఉద్యమించవలసిన అవసరం ఉన్నంతకాలం ఆ దేశాన్ని పనిపూర్ణమైన ప్రజాస్వామ్యంగా పరిగణించలేము. అటువంటి పరిస్థితులలోనే పౌరహక్కుల ఉద్యమాలకు, బాలగోపాల్‌వంటి ఉద్యమకారులకు ప్రాముఖ్యత పెరుగుతుంది. ఆయన గత పాతికేళ్ళ ఉద్యమశీలతను, కార్యకలాపాలను ఈ నేపథ్యంలో పరిశీలించవలసి ఉంటుంది.

మనదేశంలో పౌరహక్కుల ఉద్యమాలన్నవి పేదలు, మధ్య తరగతి వారు పాలనా వైఫల్యాలతో అసంతృప్తికి, అశాంతికి లోనుకావటంతో మొదలయ్యాయి. ప్రజల అసంతృప్తి, అశాంతి 1960ల నుంచి మొదలుకొని పలు రూపాలలోక వెల్లడవుతుండటం తెలిసిందే. ఆ రూపాలలో నక్సలిజం ఒకటి. వ్యవస్థను సంస్కరించాలనే తక్కిన రూపాల కన్నా దానినిమార్చివేయాలనే నక్సలిజం రూపం పాలకులకు అసలు సవాలు గనుక, వారు ప్రధానంగా దానిపై దృష్టి కేంద్రీకరించి అణచివేయబూనుకొన్నారు. అది ఆచరణలో పేదలు, రైతులు, కార్మికులు, కూలీలు, వృత్తిదారులు, యువజనులఅణచివేతగా మారటంతో, అందులోని అతికివ్యతిరేకంగా పౌరహక్కుల ఉద్యమాలు పుట్టుకువచ్చాయి. తొలిదశలో జాతీయ స్థాయిలో పియుసిఎల్, పియుడిఆర్,ఇక్కడ ఎపిసిఎల్‌సి, ఒపిడిఆర్‌వంటి సంస్థలు పనిచేశాయి. అవి బలహీనపడిన తర్వాత రెండవదశలోనూ హక్కుల ఉద్యమాన్ని అంతేబలంగా కొనసాగించిన వ్యక్తి బాలగోపాల్. రాష్ట్రంలోనే గాక మొత్తం దేశస్థాయిలో కూడా తనను ప్రత్యేకంగా, విశిష్ఠంగా నిలబెట్టింది ఇదే. తను నాయకత్వం వహించినడిపిన ఈ రెండవదశలో మొదటి దశలోని హక్కుల అజెండాతోపాటు ఇతర పౌరహక్కుల సమస్యలు కూడా వచ్చి చేరాయి. ఈ పరివర్తనా క్రమంలో తనకు విప్లవోద్యమాలతో కొంత భిన్నత్వం ఏర్పడింది గాని అది వైరుధ్యంగా మారలేదు.

బాలగోపాల్ విశిష్ఠతలు మరి రెండున్నాయి. తను ఎంతటి గొప్ప మేధావి, రచనాదక్షుడో అందుకు తీసిపోని అవిశ్రాంత బేర్‌ఫుట్ హక్కుల కార్యకర్త. ఇది ఒకటి కాగా, రెండవది తన అవగాహనలు. మారుమూల గ్రామం నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు గల విషయాలపై, వాటి భిన్నకోణాలపై, పరస్పర సంబంధాలపై, అదే

విధంగా మారుమూలగల వ్యక్తుల నుంచి మొదలుకొని అంతర్జాతీయ స్థాయి వరకు గల వ్యక్తుల సమూహాలపై, వారి పరస్పర ప్రభావాలపై బాలగోపాల్ అవగాహనలు నిరుపమానమైనవి. ఈవిధమైన బహుముఖ విశిష్టలతో రెండున్నర దశాబ్దాలపాటు నిర్భయంగా పౌరహక్కులకోసం పాటుపడిన మరొక వ్యక్తి భారతదేశ చరిత్రలోనే మరొకరులేరు. మానవాభివృద్ధితో నిమిత్తంలేని ఆర్థికాభివృద్ధిని మరింత విజృంభించి సాగించేందుకు ఆర్థిక సంస్కరణల పేరిట సాగుతున్న కార్యకలాపాలు అణగారిన వర్గాల పౌరహక్కులకు సరికొత్త విఘాతాలు కల్పిస్తున్న ప్రమాదకర దశలో బాలగోపాల్ వంటివారు లేకపోతుండటంఇంకా ఆందోళనకరమనాలి.

*వార్త సంపాదకత్వం, 10 అక్టోబరు 2009*